ప్రైవేటీకరణ మంచిది కాదు



ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ మంచిదికాదు. అలాగే మెడిసిన్‌లో సీట్ల కేటాయింపులను తిరస్కరించడం అన్యాయం. నూతన వైద్య కళాశాలలు ఏర్పాటైతే పేద విద్యార్థులకు అనుకూలంగా ఉంటుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన మెడికల్ కళాశాలలను కూడా పేదలకు దూరం చేయాలని యత్నించడం దారుణం. కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది. అనాలోచిత నిర్ణయాలతో పేద విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతోంది.

- సి.తేజ, బైపీసీ విద్యార్థి, పాకాల



పేద విద్యార్థులకు నష్టం



కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలనుకోవడం సరికాదు. కొత్తవి ఏర్పాటు చేయకపోయినా పర్వాలేదు కానీ, గత వైఎస్సార్‌సీపీ తీసుకువచ్చిన మెడికల్ కాలేజీలను సైతం నిర్వీర్యం చేయాలని చూడడం దుర్మార్గం. గతంలో యువగళం యాత్రం సందర్భంగా నారా లోకేష్ ఇచ్చిన హామీని ఒక్కసారి గుర్తుచేసుకోవాలి. వైద్యకళాశాలల్లో 50శాతం సీట్లు కన్వీనర్ కోటాకు కేటాయించారని, ఆ జీఓను రద్దు చేస్తామని ప్రకటించారు. ఆ మాటను ఇప్పుడు నిలబెట్టుకోవాలి.

- రవి, బైపీసీ విద్యార్థి, పాకాల



ఛీటింగ్ 6

- సూపర్‌సిక్స్ హామీలపై చంద్రబాబు జీద ఏడుపులు
- తల్లికి వందనం అమలుకు ఎదురుచూస్తున్న తల్లులు
- పెట్టుబడి సాయం అందక రైతుల ఇక్కట్లు

ఎలుక తోలు తెచ్చి ఏడాది ఉతికినా.. అన్న సామెత చంద్రబాబు విషయంలో మరోసారి రుజువైంది. అందరూ అనుమానించినట్టే గద్దెనెక్కిన తర్వాత బాబు నిజ స్వరూపం మరోసారి బట్టబయలైంది. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ అంటూ హామీలు గుప్పించిన నారావారు మరోసారి ప్రజలను 'ఛీ'టింగ్ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టేశారు. మహిళా శక్తి పేరుతో ఆడపడుచులకు ప్రతి నెలా రూ.1,500 జమ చేస్తామని మభ్య పెట్టి ఇప్పుడు ముఖం చాటేస్తున్నారు. తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికీ రూ.15వేలు అందిస్తామని చిలకపలుకులు వల్లించి ఇప్పుడేమో డేటా సేకరించాలంటూ కల్లబొల్లి కబుర్లతో కాలయాపన చేస్తున్నారు. అన్నదాతా సుఖీభవ పేరిట రైతులకు ఏటా రూ.20వేల సాయం చేస్తామని ఆశలు కల్పించి అవసరం తీరాక కుంటి సాకులు చెబుతున్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు లేదా రూ.3వేల చొప్పున నిరుద్యోగ భృతి చెల్లిస్తామని బీరాలు పలికిన బాబుగారు మాట నిలబెట్టుకోవాల్సిన సమయం వచ్చే సరికి మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణమంటూ నమ్మబలికి ఇప్పుడు విధివిధానాల తయారీకి అధ్యయనం పేరుతో నీరుగార్చేస్తున్నారు. ప్రతి ఇంటికీ మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామని ఊదరగొట్టిన చంద్రబాబు ఇప్పుడేమో ఆ ఊసే పూర్తిగా మరచిపోయారు. ఓట్ల కోసం మోసపు మేనిఫెస్టోని ప్రకటించి.. ఈ నెల 20వ తేదీకి అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నా హామీ ఇచ్చిన అన్ని పథకాల అమలుకు మంగళం పాడేస్తున్నారు.

– తిరుపతి అర్బన్/ తిరుపతి రూరల్

సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

తిరుపతి, చంద్రగిరి నియోజక వర్గాలలో అర్హులైన మహిళలు

4,59,000



వైఎస్ జగన్ పాలనలో ఏడాదికి రైతులకు అందిన సాయం

రైతు భరోసా పథకం

నియోజకవర్గం	లబ్ధి (రూ. కోట్లలో)
తిరుపతి	లేరు
చంద్రగిరి	22.86





కూటమి పాలనలో ఏడాదికి రైతులకు అందాల్సిన సాయం

అన్నదాత సుఖీభవ పథకం

నియోజకవర్గం	లబ్ధి (రూ. కోట్లలో)
తిరుపతి	లేరు
చంద్రగిరి	72.23

అమ్మఒడి

నియోజకవర్గం	లబ్ధి (రూ. కోట్లలో)
తిరుపతి	59.2
చంద్రగిరి	47.31



తల్లికి వందనం

నియోజకవర్గం	లబ్ధి (రూ. కోట్లలో)
తిరుపతి	295.05
చంద్రగిరి	63.96



ప్రతి మహిళకు నెలకు రూ.1500

తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాలలో అర్హులైన మహిళలు

2,16,250

వీరికి 2 నెలలకు ఇవ్వాల్సిన భృతి

రూ.64.87 కోట్లు



యువతకు నెలకు రూ. 3 వేల నిరుద్యోగ భృతి

తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాలలో అర్హులైన యువత

3,42,000

వీరికి 2 నెలలకు ఇవ్వాల్సిన భృతి

రూ.205.02 కోట్లు



ప్రతి ఇంటికి 3 గ్యాస్ సిలిండర్లు

తిరుపతి, చంద్రగిరి నియోజక వర్గాలలో అర్హులు

98,000

వెంటనే 'భృతి' చెల్లించాలి



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేయాలి. డిగ్రీ పూర్తి చేసిన వారికి ప్రతి నెలా రూ.3వేలు బ్యాంకు ఖాతాలో వేస్తామన్నారు. అయితే ప్రభుత్వం ఏర్పాటు చేసి వంద రోజులు పూర్తి కావస్తున్నా.. ఇప్పటికీ ఎలాంటి స్పందన లేదు. ఇది చాలా అన్యాయం. వెంటనే నిరుద్యోగులకు భృతి చెల్లించాలి.

- శ్రావణి, మద్దినాయనపల్లె, పాకాల మండలం

ఇంటికో ఉద్యోగం ఏమైంది?



కూటమి పార్టీల నేతలు ఇంటికో ఉద్యోగమిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. అధికారంలోకి వస్తూనే మాట నిలబెట్టుకుంటామని ఊదరగొట్టారు. ఇప్పటి వరకు ఉద్యోగాలకు సంబంధించిన ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. ప్రభుత్వ వైఖరిపై ప్రజల్లో తలెత్తిన సందేహాలను నివృత్తి చేసి ప్రతి ఇంట్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలి.

- దీపిక, మద్దినాయనపల్లె, పాకాల మండలం

రూ.20వేల జాడ లేదే?



వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సాగుకు సమాయత్తం చేసుకున్నాం. అయితే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకునేలా కనిపించడంలేదు. అన్నదాత సుఖీభవ కింద ఏటా రూ.20వేలు ఇస్తామన్నారు. ఆ జాడ కనిపించడం లేదే. అదే ఆందోళనగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే నిధులు విడుదల చేయాలి. - భాస్కర్‌రెడ్డి, నడవలూరు, రామచంద్రాపురం మండలం

'వందనం' ఎప్పుడో..?



గతంలో జగనన్న ప్రభుత్వం ఏటా క్రమం తప్పకుండా అమ్మ ఒడి పథకం అమలు చేశారు. తల్లుల ఖాతాల్లో రూ.15వేలు జమ చేశారు. అయితే చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటా లేదా అనేది ఆందోళనగా ఉంది. పాఠశాలలో ఫీజులు కట్టమని ఒత్తిడి చేస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి విద్యార్థికీ రూ.15వేలు ఇవ్వాలి. - భాస్కర్‌రెడ్డి, కుప్పంబాదూరు, రామచంద్రాపురం మండలం

రూ.3వేల ఊసే లేదు!



కూటమి ప్రభుత్వం ఏపీ యువ నేస్తం పథకం కింద నిరుద్యోగులకు భృతి ఇస్తామని భరోసా ఇచ్చింది. రెండు నెలలు గడిచినా ఇప్పటికీ రూ.3వేల ఊసే లేదు. గతంలో కూడా నిరుద్యోగులకు భృతి ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు మోసం చేశారు. ఇప్పుడు అదే పరిస్థితి వస్తుందేమో అర్థం కావడం లేదు.

- ప్రవీణ్‌కుమార్, చిన్నగొట్టిగల్లు మండలం

క్లుప్తంగా

గరుడునిపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి : శ్రీనివాస మంగాపురంలో శ్రీకళ్యాణ వెంకటేశ్వర స్వామి వారు బుధవారం గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. పెరటాసి మాసం పౌర్ణమి సందర్భంగా ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వా మి, అమ్మవార్లకు ఊంజల్ సేవ జరిపించారు.

'స్పోకెన్ ఇంగ్లిష్' పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న స్వామి సుకృతానంద

తిరుపతి కల్చరల్ : ఎస్వీయూకి చెందిన వ్యక్తిత్వ వికాస నిపుణుడు, డాక్టర్ గోపాల్ రచించిన స్పోకెన్ ఇంగ్లిష్ స్కిల్స్ (ఆంగ్లభాష నైపుణ్యాలు) పుస్తకాన్ని శ్రీరామకృష్ణ మిషన్ ఆశ్రమంలో కార్యదర్శి స్వామి సుకృతానంద బుధవారం ఆవిష్కరించారు. స్వామి మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యేలా ఇంగ్లిష్‌లో ఎలా మాట్లాడాలో సుమారు 2వేలకుపైగా వాక్యాలను పుస్తకంలో పొందుపరిచారని తెలిపారు.

ప్రథమ చికిత్సపై అవగాహన



మాట్లాడుతున్న స్విమ్స్ డాక్టర్లు

తిరుపతి సిటీ : స్వచ్ఛత హీసేవ అభియాన్‌లో భాగంగా పద్మావతి మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ బ్యూరో ఆధ్వర్యంలో బుధవారం వర్సిటీలోని శానిటేషన్ వర్కర్స్‌కు ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. స్విమ్స్ వైద్యులు మనోజ్, శిరీష మాట్లాడుతూ గుండె పోటు, పాము, తేలు, శునకాల కాటుకు గురైనప్పుడు తీసుకోవాల్సిన తక్షణ చర్యలను వివరించారు.ఎన్ఎస్ఎస్ అధికారులు విద్యావతి, నీరజ, సుజాత పాల్గొన్నారు

'ఏచూరి' సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూమన తదితరులు

తిరుపతి కల్చరల్ : దేశానికి సీతారాం ఏచూరి అందించిన సేవలు చిరస్మరణీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందారపు మురళి కొనియాడారు. బుధవారం యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం, స్విమ్స్ మాజీ డైరెక్టర్ జి.సుబ్రమణ్యం హాజరై సీతారాం ఏచూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజకీయాలలో విలువల కోసం పాటుపడిన వ్యక్తి ఏచూరి అని తెలిపారు. ఆయన స్ఫూర్తితో కమ్యూనిస్టు శ్రేణులు ముందుకుసాగాలని పిలుపు నిచ్చారు. మాజీ ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ 1977లో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా సీతారాం ఏచూరి తీవ్రంగా పోరాడారని, ఇందిరాగాంధీనే నిలదీసిన ఘనుడని కొనియాడారు. ప్రపంచ పరిజ్ఞానాన్ని ఔపోసన పట్టిన మేధావి ఏచూరి అని వెల్లడించారు. ఆయన స్ఫూర్తితో అభ్యుదయ ఉద్యమాలు బలోపేతం కావాలని పిలుపు నిచ్చారు. నేతలు మురళి, పి.అంజయ్య, కేవీ చౌదరి, రాఘవ శర్మ, టెంకాయల దామోదరం ,టి.సుబ్రమణ్యం, డి.జనార్ధన్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత నగరమే లక్ష్యం



దుకాణంలో తనిఖీ చేస్తున్న కమిషనర్

తిరుపతి తుడా : ప్లాస్టిక్ రహిత తిరుపతి నగరమే లక్ష్యంగా కార్యాచరణ అమలు చేస్తున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ మౌర్య స్పష్టం చేశారు. బుధవారం నగరంలోని పలు ప్రాంతాలు, దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తున్న దుకాణదారులకు సుమారు రూ.7లక్షలకు పైగా జరిమానాలు విధించారు. కమిషనర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు, స్పూన్లు, కవర్లు విక్రయిస్తే ఆయా షాపుల లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి పాల్గొన్నారు.

పాఠశాల ప్రొఫైల్ తప్పనిసరి

పాకాల : ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల ప్రొఫైల్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్ర సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ అపర్ణ ఆదేశించారు. బుధవారం మండలంలోని దామలచెరువు జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రొఫైల్‌లో పాఠశాలలోని వసతులను పొందుపరచాలని కోరారు. ఉపాధ్యాయులు పాఠశాల టైమ్ టేబుల్‌ను నోటీస్ బోర్డులో ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో అకడమిక్ అధికారి శివశంకరయ్య, అసిస్టెంట్ అకడమిక్ అధికారి మధు, హెచ్ఎం నాగరాజు, రిసోర్స్‌పర్సన్ రమేష్‌నాయుడు, ప్రమీల, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కేరీర్ గైడెన్స్ సెమినార్

తిరుపతి సిటీ : ఎస్వీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు బుధవారం కెరీర్ గైడెన్స్‌పై సెమినార్ నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్‌పై విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారిస్తే ఉద్యోగావకాశాలకు కొదవ ఉండదన్నారు. సెమినార్ కండక్ట్ చేసిన డాక్టర్ జాలే వాసుదేవనాయుడు, భాస్కర్‌ను అభినందించారు

అక్టోబర్ 4న స్టాండింగ్ కమిటీ ఎన్నిక

తిరుపతి తుడా : తిరుపతి నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక అక్టోబర్ 4వ తేదీన నిర్వహించనున్నట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ గురువారం నోటీసు ప్రచురిస్తున్నామని, పోటీ చేయదలచిన కార్పొరేటర్లు ఫారమ్–3ని పూరించి ఈనెల 26వ తేదీలోపు అందజేయాలని సూచించారు.

పోషకాహారంతో ఆరోగ్యం

పాకాల : గర్భిణులు, బాలింతలు, బాలికలు, చిన్నారులు పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్ వైజర్ కిరణ్మయి తెలిపారు. బుధవారం రామిరెడ్డిగారియిండ్లు అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. సర్పంచ్ గౌరీశంకర్‌రాజు, జెడ్పీటీసీ సభ్యులు నంగా పద్మజారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సురేష్, ఎంపీడీఓ ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆలయ ఆదాయ వనరుల వేలం

చంద్రగిరి : గ్రామ దేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ అమ్మవారి ఆలయ ఆదాయ వనరులకు బుధవారం ఈఓ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. పూజా సామాగ్రి విక్రయం రూ.2.8లక్షలు, వస్త్రాల సేకరణ రూ.1.05లక్షలు, కొబ్బరి చిప్పల సేకరణ రూ.1.11లక్షలతో మొత్తం రూ.4.96లక్షలు ఆదాయం సమకూరినట్లు ఈఓ రామకృష్ణారెడ్డి తెలిపారు.

పోడియం.. తొలగించాం



శ్రీరామకుమార్, జిల్లా రిజిస్ట్రార్

తిరుపతి అర్బన్ : జిల్లావ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పోడియం తొలగించామని జిల్లా రిజిస్ట్రార్ శ్రీరామకుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ సైతం సాధారణ కుర్చీలోనే కూర్చుని విధులు నిర్వహించాలని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అలాగే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సీసీ కెమెరాలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు.

టాస్క్‌ఫోర్స్ డీఎస్పీగా మురళీధర్



తిరుపతి మంగళం : ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్‌ఫోర్స్ డీఎస్పీగా మురళీధర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

తిరుమలలో అన్యమత వాహనం

తిరుమల : తిరుమలలో అన్యమత వాహనం కలకలం రేపింది. ఇతర మతానికి చెందిన గుర్తుగల స్టిక్కర్ వేసిన ఓ ద్విచక్రవాహనాన్ని రాంబగీచా అతిథిగృహం వద్ద భక్తులు గుర్తించారు. టీటీడీ విజిలెన్స్ విభాగం వైఫల్యం వల్లే ఈ వాహనం కొండపైకి రాగలిగిందని భక్తులు మండిపడ్డారు. అలిపిరి వద్ద నామ మాత్రంగా తనిఖీలు చేసి తిరుమలకు అనుమతించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు 'వెటర్నరీ' వార్షికోత్సవం

తిరుపతి సిటీ : ఎస్వీ వెటర్నరీ కళాశాల 61వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించనున్నారు. అసోసియేట్ డీన్ జగపతిరామయ్య మాట్లాడుతూ కళాశాల దినోత్సవం సందర్భంగా బోధన, బోధనేతర సిబ్బందికి, విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించామన్నారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

కేబుల్స్ సరిచేయాలి

తిరుపతి తుడా : నగరంలో ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న కేబుల్స్‌ను నెలలోపు సరిచేసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆదేశించారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ ప్రొవైడర్లు, ఎస్పీడీసీఎల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్ర, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు

యాదవుల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న బుసగాని లక్ష్మయ్య

తిరుపతి కల్చరల్ : యాదవుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని అఖిల భారత యాదవ మహాసభ జాతీయ అధ్యక్షుడు బుసగాని లక్ష్మయ్య తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. , టీటీడీ బోర్డు చైర్మన్ పదవిని యాదవులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. శ్రీవారిని తొలి దర్శనం చేసుకున్న యాదవుడు శరభయ్య విగ్రహాన్ని అలిపిరిలో ప్రతిష్ఠించాలని కోరారు. ఈ క్రమంలో యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా కుప్పం రవి యాదవ్, ఉపాధ్యక్షుడిగా గాలం వెంకటేష్ యాదవ్, జిల్లా అధ్యక్షుడిగా మేకల రవియాదవ్, ఉపాధ్యక్షుడిగా వంశీకృష్ణ యాదవ్‌ను నియమించినట్లు ప్రకటించారు. నేతలు వాసుదేవ యాదవ్, వెంకటకృష్ణయ్య, సురేష్ యాదవ్ పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం



దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తిరుపతి సిటీ : స్థానిక కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విభాగం, కృష్ణ దీపిక డెంటల్ కేర్ ఇంప్లాంట్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాంపులో విద్యార్థులు, సిబ్బందికి దంత పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి, డాక్టర్ చంద్రయ్య, సుజన్‌కుమార్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చండీ హోమం



పూర్ణాహుతి సమర్పిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్ : శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో బుధవారం శాస్త్రోక్తంగా మహా చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం, ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులకు పసుపు, కుంకుమ, దారం, గాజులు, ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ.మమత పాల్గొన్నారు.